

'నేటి సమాజపు యుగకర్త గురజాడ'

భీమవరం టౌన్ : తెలుగు సాహిత్యంలో వాడుక భాషకు పేరు, ప్రఖ్యాతులు తేవాలని నినదించడంతోపాటు దానికి గొప్ప ఒరవడి దిద్దిన యుగకర్త మహాకవి గురజాడని పలువురు పేర్కొన్నారు. శనివారం అభ్యుదయ రచయితల సంఘం జిల్లా ఆధ్వర్యంలో గురజాడ వర్ధంతిని జరిపారు. ఈ సందర్భంగా అరసం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ మాట్లాడుతూ దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అని నినదించిన మహాకవి గురజాడ ఎంతో ఆదర్శప్రాయుడని, సంస్కరణ వాదియని కొనియాడారు. ఆయన రాసిన పుత్తడిబొమ్మ పూర్ణమ్మ నేటికీ సమాజానికి ఎంతో అవసరం అయిన రచనలని ఆయన అన్నారు. రోజువారి కూలీలను తన రచనల ద్వారా ప్రభావితం చేసిన గురజాడను నేటి యువ రచయితలు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కళారంజని అధ్యక్షులు జవ్వాది దాశరధి శ్రీనివాస్, ప్రజా కళాకారుడు చాంద్ భాషా మాట్లాడుతూ ప్రజానీకానికి కావలసిన ఎన్నో గొప్ప నాటకాలను ఆయన రాయడంలో ఆయనకు ఆయన సాటి అన్నారు. న్యాయవాది మల్లుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార దిక్సూచి.. పిడిఎఫ్

- ఉద్యమాలను ముందుండి నడిపించాలన్నా.. ప్రజాగొంతు వినిపించాలన్నా పిడిఎఫ్‌కే సాధ్యం
- ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, సామాన్య ప్రజలకు అండగా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు
- 5న ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నిక బరిలో నిలిచిన పిడిఎఫ్ అభ్యర్థి బి.గోపీమూర్తి
- యుటిఎఫ్‌తోపాటు మద్దతు పలికిన పలు ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు

ప్రజాశక్తి - భీమవరం

సమస్య ఏదైనా.. పరిష్కారమే లక్ష్యంగా ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంది. ఎన్ని అవరోధాలు వచ్చినా.. మరెన్నో ఇబ్బందులు ఎదురైనా నమ్మిన సిద్ధాంతానికి పిడిఎఫ్ కట్టుబడి పని చేస్తోంది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కర్షకులు, సామాన్య ప్రజానీకానికి అండగా నిలుస్తూ సమస్యల పరిష్కార వేదికగా పిడిఎఫ్ నిలుస్తోంది. ఉద్యమాలను ముందుండి నడిపించాలన్నా.. ప్రజాగొంతు వినిపించాలన్నా పిడిఎఫ్‌కే సాధ్యం. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతున్న పరిస్థితుల్లో పిడిఎఫ్ తనదైన పాత్ర పోషించాలంటే చట్టసభల్లో ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఎంతో ఉంది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఒకే తాటిపైకి వచ్చి సమస్యల పరిష్కారానికి పిడిఎఫ్ అందించిన సాయం, చేసిన కృషిని మరోమారు గుర్తు చేసుకుని వచ్చే నెల ఐదో తేదీన జరగనున్న ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో పిడిఎఫ్ బలపర్చిన బి.గోపీమూర్తిని గెలిపించుకోవాల్సిన గురుతర బాధ్యత అందరిపైనా ఉంది.

డిసెంబర్ 5న జరగనున్న తూర్పు - పశ్చిమగోదావరి ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉపఎన్నికల్లో యుటిఎఫ్, ఎపిటిఎఫ్-1938, బిటిఎ, ఎటిఎ, టిడబ్ల్యూఇఎ, ఎపి ఆర్ఇఎస్, జూనియర్, డిగ్రీ కళాశాలల లెక్చరర్స్ అసోసియేషన్స్ మద్దతుతో పిడిఎఫ్ అభ్యర్థిగా బొర్రా గోపీమూర్తి బరిలో నిలిచారు. అయితే పిడిఎఫ్ ఎంఎల్‌సిలను ఎందుకు గెలిపించుకోవాలి, ఆ ఎంఎల్‌సిల పని విధానం ఏ విధంగా ఉంటుంది, వారు ఏం చేస్తారు, ఎవరి పక్షాన నిలుస్తారనే అంశాలను తెలుసుకోవడంతోపాటు మరోసారి వాటిని గుర్తు తెచ్చుకోవాల్సిన అవసరం ప్రస్తుత పరిస్థితుల్లో ముఖ్యాంశంగా ఉంది.

ఇప్పటి వరకూ పని చేసిన పిడిఎఫ్ ఎంఎల్‌సిలు సమస్యలపై ప్రశ్నించారు. మండలిలో సామాన్యుడి గళమై వినిపించారు. ఉద్యమాలకు అండగా ఉన్నారు. ప్రభుత్వంతో వారధిగా వ్యవహరించారు. అభివృద్ధికి సలహాలిచ్చారు. అసంబద్ధాలపై ప్రభుత్వాన్ని నిలదీశారు. నిజాయతీగా మసలుకున్నారు. నిక్కచ్చిగా వ్యవహరించారు. అధికార దర్పానికి దూరంగా ఉన్నారు. సామాన్య ప్రజల్లో ఒకరిగా ఉంటున్నారు.

ముఖ్యంగా అప్రెంటీస్ విధానం రద్దు, ఆ సర్వీసు పెన్షన్, సోషల్ ఇంక్రిమెంట్లు, గిరిజన, మున్సిపల్ టీచర్ల సర్వీస్ రూల్స్, ఎయిడెడ్ టీచర్లకు 010 హెడ్ ద్వారా జీతాలు, కాంట్రాక్ట్ లెక్చరర్ల మినిమమ్ టైమ్ స్కేల్, మోడల్ స్కూల్ టీచర్ల సర్వీస్ రూల్స్, కెజిబివి, అంగన్‌వాడీ, రెసిడెన్షియల్ పాఠశాలల టీచర్ల సమస్యలు, ఇలా ప్రతి సమస్య పరిష్కారంలోనే సంఘాలకు అండగా నిలిచారు. పోరాటాలకు ముందున్నారు. ప్రయివేట్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను సైతం మండలిలో ప్రస్తావించారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించే బాధ్యత ప్రభుత్వమే చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యుత్, టిటిడి ఉద్యోగులు, పెన్షనర్లు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు ఎక్కడ ఏ ఉద్యమాలు చేపట్టినా వారికి అండగా నిలిచారు. వారి ప్రజాస్వామ్య హక్కుల కోసం కృషి చేశారు. క్లస్టర్ విధానాన్ని వ్యతిరేకించారు ఐదుగురు టీచర్లతో కూడిన మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటుకు కృషి చేశారు. తాజాగా నూతన విద్యా విధానం పేరుతో ప్రాథమిక పాఠశాలలు కుదింపునకు వ్యతిరేకంగా బస్సుయాత్ర చేపట్టి ప్రాథమిక పాఠశాలలను రక్షించే ప్రయత్నం చేశారు. సిపిఎస్ రద్దు కోసం జరిగిన ప్రతి పోరాటంలోనూ ముందుండి పాల్గొన్నారు. పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఉద్యోగ, ఉపాధ్యాయుల సుఖ సంతోషాల్లోనే కాదు.. కష్ట నష్టాల్లో కూడా పాలుపంచుకుంటున్నారు. అందుకే ఎవరికి ఏ చిన్న కష్టమొచ్చినా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఎక్కడా అంటున్నారు.

రాష్ట్రంలో పాలకపార్టీ చాలు చెప్పింది వేదమన్నట్లు వ్యవహరిస్తున్న నేపథ్యం.. ప్రజా సమస్యలకన్నా రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమనే ప్రధాన ప్రతిపక్షం.. ఈ రెండింటికీ భిన్నంగా ప్రజా సమస్యలపై మండలిలో నిరంతరం గళమెత్తేవారు పిడిఎఫ్ ఎంఎల్‌సిలు మాత్రమే.



గోపీమూర్తి

టీచర్స్ ఎంఎల్‌సి పిడిఎఫ్ అభ్యర్థిగా బి.గోపీమూర్తి

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నిక ఆసక్తిగా మారింది. ఈసారి పోటీ ఎలా ఉంటుందోననే చర్చ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో జోరుగా సాగుతోంది. ఇప్పటికే నాలుగు దఫాలు ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలు జరిగాయి. 2007 నుంచి 2009 వరకూ శేషారెడ్డి, రెండోసారి 2010 నుంచి 2015 వరకూ చైతన్యరాజు, మూడోసారి పిడిఎఫ్ బలపర్చిన రాము సూర్యారావు, నాలుగోసారి 2021 మార్చి 17న జరిగిన ఎన్నికల్లో షేక్ సాబ్జీ విజయం సాధించారు. ఆయన 2023 డిసెంబర్ 15న రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఆ ఎన్నికల్లో నియోజకవర్గంలో మొత్తం 17,467 మంది ఓటర్లుండగా 16,054 ఓట్లు పోలయ్యాయి. 11 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. షేక్ సాబ్జీకి 7,987 ఓట్లు రాగా, వైసిపితో పాటు పిఆర్‌టియు, ఇతర ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో బరిలోకి దిగిన సమీప ప్రత్యర్థి గంధం నారాయణరావుకు 6,453 ఓట్లు పోలయ్యాయి. దీంతో షేక్ సాబ్జీ 1,534 ఓట్ల మెజారిటీతో మొదటి ప్రాధాన్యతా ఓట్లతోనే విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో టిడిపి మద్దతు తెలిపిన చెరుకూరి సుభాష్ చంద్రబోసుకు 106 ఓట్లు, బిజెపి మద్దతుతో పోటీ చేసిన ఇళ్ల సత్యనారాయణకు 300 ఓట్లు పడ్డాయి. పిడిఎఫ్ తరపున ఎంఎల్‌సిలుగా గెలుపొందిన రాము సూర్యారావు, షేక్ సాబ్జీ పనితీరుపై ఉపాధ్యాయుల్లో పూర్తి సంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో పిడిఎఫ్ అభ్యర్థిగా యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి బరిలోకి దిగారు. ఆయన ముమ్మర ప్రచారంలో ఉన్నారు. విద్యావేత్తగా, సామాజికవేత్తగా గోపీమూర్తికి మంచి పేరుంది. ఉపాధ్యాయ ఉద్యమ సారథిగా, షేక్ సాబ్జీ ఉద్యమ వారసునిగా పేరొందారు. ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో ప్రతిసారీ పిడిఎఫ్ బలంగా పోటీ ఇవ్వడమే కాకుండా విజయం సాధిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో కూడా పిడిఎఫ్‌కు విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని, గోపీమూర్తి విజయం తథ్యమనే ప్రచారం జోరుగా సాగుతోంది.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

హింస లేని సమాజ స్థాపనకు కృషి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

హింస లేని సమాజ స్థాపనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ నాగరాణి అధికారులకు ఆదేశించారు. మహిళలు, బాలికలు లైంగిక చట్టాలపై మరింత అవగాహన పెంపొందించుకోవాలన్నారు. చట్టాలు పటిష్ట అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక కాస్మోపాలిటిన్ క్లబ్‌లో జిల్లా మహిళా, శిశుసంక్షేమ సాధికారత శాఖ ఆధ్వర్యంలో బాలలు, మహిళలు అత్యాచార నిరోధక చట్టాలపై అవగాహనా సదస్సు శనివారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ నాగరాణి ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు, బహిరంగ ప్రదేశాల్లో జరిగే లైంగిక దాడులను సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, సమాజంలో ప్రజలు ఒక కంట పిల్లలను గమనిస్తుండాలన్నారు. అప్పుడే ఇటువంటి చర్యలకు పాల్పడే వారిని గుర్తించి, శిక్షించడానికి అవకాశం ఉంటుందన్నారు. పురుషులతో సమానంగా స్త్రీలు అనే నినాదం కొనసాగుతున్న వేళ పురుషుల కంటే స్త్రీలు మరింత ఎక్కువగా పని చేయాలన్నారు. స్త్రీ అంటేనే ఒక ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. మహిళలను రాత్రి వేళల్లో అరెస్టు చేయడానికి వీల్లేదని, సంబంధిత కుటుంబ సభ్యులు తప్పకుండా ఉండాలని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు మాట్లాడుతూ ఆడ, మగ తేడా లేని సమాజ నిర్మాణం జరగాలన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం జిల్లాలో కఠినంగా అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఉన్న 151 స్కానింగ్ సెంటర్లో ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే డెకాయ్ ఆపరేషన్ ద్వారా నిరోధించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిఇఒ ఇ.నారాయణ మాట్లాడుతూ పాఠశాలల్లో, బహిరంగ ప్రదేశాల్లో పిల్లలకు గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగించాలన్నారు. జిల్లా కార్మిక శాఖ అధికారి ఎ.లక్ష్మి మాట్లాడుతూ మహిళలకు పురుషులతో సమానత్వం కల్పిస్తూ చట్టాలను ఏర్పాటు చేయడం జరిగిందని, దీనిలో భాగంగా 2013లో చట్టాన్ని అమలులోకి తీసుకురావడం రావడం జరిగిందని తెలిపారు. జిల్లా అగ్ని మాపక నిరోధక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో బలమైన పర్యవేక్షణ, నైతిక విలువలు నేర్పించడం జరిగేవన్నారు. డ్వామా పీడీ కెసిహెచ్ అప్పారావు, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆర్ఎస్.కుమారేశ్వరన్ మాట్లాడారు. గృహహింస, వరకట్నం, జీవించే హక్కు వంటి చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి బి.సుజాతారాణి, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి పి.నాగార్జునరావు, డిఎఫ్ఒ బి.శ్రీనివాసరావు, డిఎల్ఒ ఎ.లక్ష్మి, జిల్లా గృహ నిర్మాణ శాఖ ఇన్‌ఛార్జి పీడీ జి.పిచ్చయ్య, ఐసిడిఎస్ నోడల్ అధికారి పి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

చిరుజల్లులు : రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - ఆచంట


బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులు పడుతున్నాయి. దీంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పంటను కాపాడుకోవడానికి పొలాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మండలంలో వరి కోతలు జోరందుకున్న నేపథ్యంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. రైతులు తమ ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవడంలో తన మునకలై ఉన్నారు. ఈ తరుణంలో వర్షం పడడంతో కష్టపడి పండించిన పంటను కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. రహదారులపైకి చేర్చిన ధాన్యాన్ని బరకాలతో కప్పి కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.



ఆచంట : ధాన్యం ఒబ్బిడి చేస్తున్న రైతులు

మొగల్తూరు : అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ ఎఒ ఎస్.అబ్దుల్ రహీం రైతులను చైతన్యపర్చారు. మండలంలోని గ్రామాల్లోని వారి క్షేత్రాలను రహీం సందర్శించారు. దీనిలో భాగంగా ఇప్పటికే వరి నూర్పు చేసి సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని పట్టుబడి చేసేందుకు ముందస్తు ఏర్పాటు చేశారు. కళ్లాల్లోని రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని పట్టుబడులు చేసి మిల్లులకు తరలించారు.

అన్నదాత దు:ఖీభవ..!



- పెట్టుబడి సాయం రూ.20 వేలపై రైతుల్లో చర్చ
- రబీ సాగు ప్రారంభమవుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన కరువు
- రెండు జిల్లాల్లో సుమారు 2.50 లక్షల మంది రైతుల ఎదురుచూపు
- కౌలురైతులకు అందేలా చర్యలుండేనా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'అన్నదాత సుఖీభవ' కింద ప్రభుత్వం అందిస్తామన్న పెట్టుబడి సాయం రూ.20 వేలు ఎప్పుడు ఇస్తారంటూ అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. ఎన్నికల్లో ఆర్భాటంగా హామీలు గుప్పించిన కూటమి అధికారంలోకొచ్చి ఆరు నెలలు గడిచినా రైతులకు అందించాల్సిన సాయంపై నోరు విప్పకపోవడం రైతాంగంలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఖరీఫ్ పూర్తయ్యిందని, రబీ సాగు ప్రారంభం కావడంతో ఇప్పుడైనా పెట్టుబడి సాయం తమ ఖాతాల్లో జమ చేయాలని రైతులు కోరుతున్నారు. గత ప్రభుత్వం రైతుభరోసా కింద ఏటా రైతులకు రూ.13,500 చొప్పున అందించింది. దీనిలో కేంద్రం మూడు విడతలుగా రూ.ఆరు వేలు జమ చేయగా, రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ ప్రారంభంలో మే చివరి వారంలో మొదటి విడతగా రూ.5,500, రెండో విడతగా రబీ సీజన్‌కు అనువుగా జనవరిలో రూ.రెండు వేలు రైతుల ఖాతాల్లో జమ చేసేది. రెండు జిల్లాల్లో దాదాపు 2.50 లక్షల మంది రైతులు రైతు భరోసా సాయం అందుకునేవారు. ఏలూరు జిల్లాలోనే లక్షా 35 వేల మంది వరకూ లబ్ధిదారులైన రైతులు ఉన్నారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందిస్తామంటూ టిడిపి కూటమి మేనిఫెస్టోలో ప్రకటించింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 80 శాతానికిపైగా ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. దీంతో రైతు కుటుంబాలు ఎన్నికల్లో కూటమికి జైకొట్టాయి. రెండు జిల్లాల్లోని 14 అసెంబ్లీ, రెండు ఎంపీ సీట్లు టిడిపి కూటమి గెలుచుకుంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి పెట్టుబడి సాయం కోసం రైతులు ఎదురుచూస్తూనే ఉన్నారు. పెట్టుబడి సాయానికి గత ప్రభుత్వం రైతు భరోసా అని పేరు పెట్టగా, ఈ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరుతో పెట్టుబడి సాయం అందించనున్నట్లు తెలిపింది. అధికారం చేపట్టి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకూ రైతులకు పెట్టుబడి సాయం హామీ మాత్రం కూటమి ప్రభుత్వం అమలు చేయలేదు. ఖరీఫ్ పూర్తయ్యి, రబీ ప్రారంభమైనా పెట్టుబడి సాయంపై ప్రభుత్వం మాట్లాడకపోవడం రైతుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పంట సాగు సమయంలో పెట్టుబడి సాయం అందించకపోతే ఏ విధంగా మేలు జరుగుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ ఏడాది అసలు పెట్టుబడి సాయం ఇస్తారా అనే అనుమానాలు సైతం రైతుల్లో నెలకొన్నాయి. ప్రభుత్వం వెంటనే పెట్టుబడి సాయం సొమ్ము అందించాలని రైతులు కోరుతున్నారు.

కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందేనా..?

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. వ్యవసాయ సాగులో 70 శాతానికిపైగా కౌలు రైతులే చేస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. నిబంధనల ప్రకారం పెట్టుబడి సాయం సాగు చేసే రైతులకే అందించాలి. ప్రభుత్వం అందించే సాయం కౌలు రైతులకు అందించాల్సి ఉంది. కౌలుచట్టంలో మార్పులు చేస్తామని ప్రభుత్వం మాటలతోనే కాలక్షేపం చేస్తోంది. ఇ-క్రాప్‌లో భూ యజమానుల పేర్లే ఉన్నాయి. ఇ-క్రాప్ ఆధారంగా పెట్టుబడి సాయం అందిస్తే భూ యజమానులకే వెళ్లిపోతుంది. సాగు చేసే కౌలురైతులకు ఎటువంటి న్యాయమూ జరగదు. ప్రభుత్వం సాగు చేసే కౌలురైతులకే పెట్టుబడి సాయం రూ.20 వేలు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. బ్యాంకులు అందించే పంట రుణాలు సాగుచేసే కౌలురైతులకు అందని పరిస్థితి నెలకొంది. రైతుమిత్ర గ్రూపుల ద్వారా కొద్ది మొత్తంలో రుణాలు అందించి కౌలురైతులకు ఇచ్చినట్లు లెక్కలు చూపుతున్న పరిస్థితి ఉంది. ప్రభుత్వం వెంటనే పెట్టుబడి సాయం అందించడంతోపాటు, సాగుచేసే కౌలురైతులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు. ప్రభుత్వం ఏ విధంగా ముందుకు సాగుతుందో వేచిచూడాలి.

గోపీమూర్తి విజయానికి సహకరించాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

ఉపాధ్యాయ ఎం ఎల్‌సి పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి విజయానికి ఉపాధ్యాయులు సహ కరించాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పోలిశెట్టి క్రాంతి కోరారు. మండలంలోని 10 జెడ్‌పి ఉన్నత పాఠశాలల్లో శనివారం 16 మంది యుటిఎఫ్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులను కలిసి తమ మొదటి ప్రాధాన్యతా ఓటును పిడిఎఫ్ బలపర్చిన గోపీమూర్తికి వేయాలని కోరారు. అనంతరం బ్యాలెట్ నమూనా పత్రాలు, స్టిక్కర్లను ఉపా ధ్యాయులకు అందించి గోపీమూర్తికి విజయం అందించాలని కోరారు. ప్రచారంలో పోలిశెట్టి కృష్ణకుమారి, మండల అధ్యక్షులు చింతపల్లి కృష్ణమోహన్, సహాధ్యక్షులు ఉషా మాధవి, డి.చింతయ్య, వై.శ్యాంబాబు, జిల్లా కౌన్సిలర్లు వై.ధర్మారావు, కె.బ్రహ్మయ్య, వి.ఏడుకొండలు, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.




నమూనా బ్యాలెట్ పత్రాలను ప్రదర్శిస్తున్న యుటిఎఫ్ నాయకులు

పింఛను సొమ్మును సద్వినియోగం చేసుకోవాలి : జెసి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రభుత్వం పేదలకు అందిస్తున్న ఎన్‌టిఆర్ భరోసా పింఛను సొమ్మును మంచిగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం భీమవరం మండలంలోని ఎక్కువ శాతం మత్స్యకార కుటుంబాలు నివసిస్తున్న నాగిడిపాలెం గ్రామంలో పర్యటించి ఎన్‌టిఆర్ భరోసా పింఛను సొమ్మును లబ్ధిదారులకు జెసి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా జెసి రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నాగిడి పాలెం గ్రామంలో వృద్ధాప్య, వితంతు, వికలాంగుల, దీర్ఘకాలిక రోగ పీడితులు, తదితరాలకు సంబంధించిన 454 మంది లబ్ధిదారులు పింఛనులు పొందుచుండగా, ఎక్కువ శాతం మత్స్యకార కుటుంబాల వారు ఉన్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదలకు పెద్ద మొత్తంలో అందిస్తున్న పింఛను సొమ్మును లబ్ధిదారులు మంచిగా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎక్కువ మంది మత్స్యకారులు నివసిస్తున్న నాగిడిపాలెం గ్రామంలో మత్స్యకారుల జీవన విధానములలో మార్పులు రావాలని సూచించారు. వచ్చిన డబ్బును వృధా, మద్యానికి ఖర్చు చేయడం మానుకోవాలని అన్నారు. కుటుంబ అవసరాలకు డబ్బును ఉపయోగించుకుని, తమ పిల్లలను బాగా చదివిస్తే వారు మంచి ప్రయోజకులు అవుతారని తెలిపారు. మీరు పనులు చేసుకుని సంపాదించే సంపాదనతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటే, తమ కుటుంబాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. వికలాంగులైన నాగిడి లక్ష్మి, నాగిడి అంజలీదేవికి ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఉన్నాయని, ప్రభుత్వం అందిస్తున్న రూ.6 వేలు పింఛను కాకుండా రూ.15 వేలు పింఛను మంజూరు చేయాలని జెసిని కోరగా అర్హులైన వారికి నిబంధనల మేరకు తప్పనిసరిగా మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. పరిశీలించాల్సిందిగా డిఆర్‌డిఎ పీడీ ఎ.వేణుగోపాల్, ఎంపిడిఒ మురళీ గంగాధర్‌ను జెసి సూచించారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పిడిఆర్‌డిఎఎంఎస్ఎస్.వేణుగోపాల్, తహశీల్దార్ రావి రాంబాబు, ఎంపిడిఒ మురళీ గంగాధర్, పెన్షన్స్ ఎపి ఒటి.మురళీకృష్ణ, గ్రామ కార్యదర్శి ప్రకాష్, విఆర్ఒ, సచివాలయం సిబ్బంది ఉన్నారు.



వికలాంగురాలికి పెన్షన్ అందజేస్తున్న జెసి

మొబైల్ వాహనాల ద్వారా నిత్యావసరాల పంపిణీ

జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సరోజ

భీమవరం : బహిరంగ మార్కెట్లో పంచదార, కందిపప్పు ధరలు అధికంగా ఉండడం వల్ల ప్రభుత్వం అందిస్తున్న ప్రజా పంపిణీ విధానం ద్వారా ఈనెలకు సంబంధించి బియ్యంతో పాటు, ఇతర నిత్యావసర సరుకులు పంచదార, కందిపప్పును అన్ని మొబైల్ వాహనాల ద్వారా పంపిణీ చేయనున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎన్.సరోజ తెలిపారు. జిల్లాలోని కార్డుదారులందరూ నిత్యావసర సరుకులు పొందాలని కోరారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

కొత్తకాలనీలో రహదారులు నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పోడూరు

కొత్తపేట కొత్తకాలనీలో రహదారులు వెంటనే నిర్మించాలని సిపిఎం పోడూరు మండల కార్యదర్శి కాకర వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పోడూరు మండలం కొత్తపేట కొత్తకాలనీలో రోడ్లు వేయాలంటూ సిపిఎం ఆధ్వర్యంలో శనివారం కొత్తకాలనీలో ధర్నా నిర్వహించి నిరసనలు తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో సెక్రటరీ పి.రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాలనీలు ఏర్పడి పది సంవత్సరాలు గడుస్తున్నా రోడ్లు పూర్తిగా వేయలేదని, అన్ని రోడ్లు నిర్మాణం చేపట్టాలన్నారు. వర్షం వస్తే నడవలేక నరకయాతన పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. కాలువగట్టున విద్యుత్ స్తంబాలు నిర్మించి, వీధి లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. మిగతా ఇళ్లకు కుళాయి నీరు అందేలా పైపు లైన్లు వేసి, కుళాయి కనెక్షన్ ఇవ్వాలని పంచాయతీ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు పిల్లి ప్రసాద్, బూరాబత్తుల వెంకటరావు, మోడీ మోజేష్, మల్లుల గణపతి, కాలనీవాసులు పాల్గొని మాట్లాడారు.

అల్లకల్లోలంగా బీచ్

పర్యాటకులు రావొద్దు : తహశీల్దార్

ప్రజాశక్తి - మొగల్తూరు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో సముద్రపు అలలు ప్రమాదకరంగా ఉన్నాయని, బీచ్‌కు పర్యాటకులు ఎవరూ రావద్దని శనివారం ఒక ప్రకటనలో తహశీల్దార్ కె.రాజకిషోర్ తెలిపారు. తదుపరి ప్రకటన వెలువడే వరకు పర్యాటకులకు అనుమతించబోమని ఆయన తెలిపారు.

మొదటి రోజు 94.29 శాతం పెన్షన్ల పంపిణీ

జిల్లాలో 2,15,537 మందికి రూ.90,25,98,500 పంపిణీ

భీమవరం : జిల్లాలో మొదటి రోజు శనివారం 94.29 శాతం పెన్షన్ల పంపిణీ జరిగింది. జిల్లావ్యాప్తంగా తెల్లవారుజాము నుంచే సిబ్బంది పెన్షన్ పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా రికార్డు స్థాయిలో పెన్షన్ పంపిణీ జరిగింది. జిల్లాలో 22,83,62 మంది పెన్షన్‌దారులు ఉన్నారు. వీరికి రూ.96,25,98,500 కోట్లు రిలీజ్ అయింది. అయితే శనివారం ఒక్క రోజులోనే 21,55,37 మందికి సుమారు రూ.90,76,0550 పంపిణీ చేశారు. ఆకివీడు అర్బన్‌లో 2,820 పెన్షన్లు పంపిణీ చేశారు. ఆచంటలో 7498, వీరవాసరంలో 7985, కాళ్లలో 8205, పెనుగొండలో 8136, యలమంచిలిలో 9602, ఆకివీడులో 5019, ఉండిలో 8205, నర్సాపురంలో 10374, పాలకోడేరుల్లో 8617, పెనుమంట్రలో 7734, మొగల్తూరులో 9971, భీమవరంలో 10658, పెంటపాడులో 9179, నర్సాపురం అర్బన్‌లో 5366 మందికి పంపిణీ చేశారు. గణపవరంలో 8187, పోడూరులో 8090, తణుకులో 8420, భీమవరం అర్బన్‌లో 10558, ఇరగవరంలో 8920, పాలకొల్లులో 8602, తాడేపల్లిగూడెం అర్బన్‌లో 8749, అత్తిలిలో 8993, పాలకొల్లు అర్బన్‌లో 5587, తాడేపల్లిగూడెంలో 11978, తణుకు అర్బన్‌లో 5084 పెన్షన్లు పంపిణీ చేశారు. సుమారు జిల్లావ్యాప్తంగా 12825 మందికి రూ.5,49,93000 కోట్లు పంపిణీ చేయాల్సి ఉంది. ఈనెల 1వ తేదీ ఆదివారం కావడంతో శనివారం నుంచే లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేయడం జరిగింది. జిల్లాలో 4,227 మంది సచివాలయ సిబ్బంది విధుల్లో పాల్గొన్నారు.

అదానీ వ్యవహారంపై టిడిపి, వైసిపి నోరువిప్పాలి : సిపిఎం

ఆకివీడు : ఆర్థిక నేరస్థుడు గౌతమ్ అదానీ వ్యవహారంపై రాష్ట్రంలోని టిడిపి, జనసేన, వైసిపిలు నోరు విప్పాలని సిపిఎం ఆకివీడు ఏరియా కార్యదర్శి కె.తవిటి నాయుడు డిమాండ్ చేశారు. ఆదానీని వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో శనివారం స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యకర్తలు కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తవిటి నాయుడు మాట్లాడుతూ పార్లమెంట్లో మోడీ నోరు విప్పాలని, కార్పొరేట్ శక్తులను నియంత్రించాలని అన్నారు. దేశ సంపదను అదానీకి కట్టబెట్టి ప్రపంచ ధనవంతుల్లో ఒకడిగా నరేంద్ర మోడీ తీర్చిదిద్దారని ఎద్దేవా చేశారు. 2014 కు ముందు వందల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిన అదానీ గడిచిన 10 సంవత్సరాల్లో ప్రధాని మోడీ అండదండలతో అపర కోటీశ్వరుడు అయ్యాడని గుర్తు చేశారు. అదానీ కుంభకోణం వల్ల రాష్ట్ర ప్రజలు లక్షల కోట్ల రూపాయలు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.1750 కోట్లు తీసుకుని గత ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందాల వల్ల 25 సంవత్సరాల పాటు ప్రజలపై విద్యుత్ భారాలను మోయక తప్పదని అన్నారు. ఎప్పుడూ జగన్‌పై నిప్పులు చెరిగే చంద్రబాబు, పవన్‌లు అదానీ విషయంలో మాత్రం జగన్‌ని ఎందుకు విమర్శించడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పెంకి అప్పారావు, బివి.వర్మ, గేదెల ధనుష్, పంపన వెంకట రమణ పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధికి కృషి చేద్దాం

వైస్ ఎంపిపి సుబ్బారావు


సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపిపి

మొగల్తూరు : గ్రామాల అభివృద్ధికి అందరూ సమన్వయంతో పని చేద్దామని వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు అన్నారు. మొగల్తూరులోని మండల పరిషత్ కార్యాలయ భవనంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. శాఖల వారీగా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష చేశారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు ఆయన సూచించారు. గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రెండవ వైస్ ఎంపిపి కవురు సీతామహాలక్ష్మి, ఎంపిడిఒ సిహెచ్.త్రిశాలపాణి, తహశీల్దార్ కె.రాజకిషోర్, డిప్యూటీ తహశీల్దార్ సంధ్య, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదిత్య విద్యార్థికి అంతర్జాతీయ టైటిల్


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్

తాడేపల్లిగూడెం : స్థానిక ఆదిత్య స్కూల్లో మూడో తరగతి చదువుతున్న అన్విష్ శౌర్య శంకర్ అంతర్జాతీయ చదరంగ సమాఖ్య ఫిడే నుంచి ఏరియా క్యాండిడేట్ మాస్టర్ టైటిల్ సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపల్ కె.వాసుదేవ్ శనివారం ఒక ప్రకటనలో వివరించారు. తాడేపల్లిగూడెం నుంచి అంతర్జాతీయ ఫిడే క్లాసికల్ రేటింగ్ విభాగంలో 1470 పాయింట్లు ఈ టైటిల్ సాధించిన మొట్టమొదటి క్రీడాకారుడు కావడం విశేషమని ప్రిన్సిపల్ అన్నారు. ఇటీవల విజయనగరం, కోనసీమలో జరిగిన చెస్ చాంపియన్ షిప్ అండర్-7 కేటగిరీలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సంపాదించారని తెలిపారు. అన్విష్ శౌర్య శంకర్‌ను ఆదిత్య తాడేపల్లిగూడెం డైరెక్టర్ కె.శ్రీవాసరెడ్డి, జిల్లా డైరెక్టర్ రాఘవరెడ్డి, స్కూల్ డైరెక్టర్ శృతిరెడ్డి, ఛైర్మన్ శేషారెడ్డి అభినందించారు.

వణికిస్తున్న తుపాన్

నరసాపురం: తుపాన్ ప్రభావం కోస్తా తీరాన్ని వణికిస్తోంది. ఉదయం నుంచి భారీ వర్షాలు పడుతుండటంతో సముద్రంలో అలజడి కొనసాగుతోంది. నరసాపురం, మొగల్తూరు సముద్ర తీరంలోని అలలు ముందుకు చొచ్చుకుపోతున్నాయి. మరోవైపు ఇసుక మేటలు సముద్రంలోకి కొట్టుకుపోతున్నాయి. భారీగా ఈదురు గాలులు వీస్తుండటంతో మత్స్యకారులు తమ బోట్లను ఒడ్డుకు చేర్చుతున్నారు. తుపాన్ ప్రభావం కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. శనివారం నరసాపురంలో భారీ వర్షం కురిసింది. తుపాన్ ప్రభావంతో ఆదివారం జరగాల్సిన వివిధ సామాజిక తరగతుల వనసమారాధనలు వాయిదా పడ్డాయి.

వీల్ చైర్ అందజేత

ఉండి : ఉండి గ్రామానికి చెందిన వికలాంగురాలు తాడేపల్లి వెంకట పద్మజకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తరపున వీల్ చైర్ అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పెన్మెత్స రామకృష్ణంరాజు, డాక్టర్ గాదిరాజు రంగరాజు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం అందించడమే మానవత లక్ష్యమని అన్నారు. శనివారం సంస్థ తరపున తాడేపల్లి వెంకట పద్మజకు రూ.12 వేలు విలువచేసే వీల్ చైర్‌ను అందించినట్లు వారు వివరించారు. ఇప్పటికే మండలంలో సంస్థ తరపున అవసరమైన వారికి వీల్ చైర్లు అందుబాటులో ఉంచుతున్నామని, ప్రతి సంవత్సరం పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. సంస్థ కో ఛైర్మన్ దంగేటి రామలింగేశ్వరరావు, కన్వీనర్ కమ్మెల నాగబాబు, కోశాధికారి కలిదిండి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహనా ర్యాలీ

గణపవరం : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక డిగ్రీ కాలేజీ విద్యార్థులతో గణపవరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీస్ ఐలాండ్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు మాట్లాడుతూ డబ్ల్యుహెచ్ఒ ఇచ్చిన హక్కుల మార్గాన్ని అనుసరించాలని అన్నారు. ఎయిడ్స్‌ని అంతం చేయటంలో అసమానతలను పరిష్కరించి, ఆరోగ్య హక్కులను సాధించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిహెచ్ఒ జాలాది విల్సన్ బాబు మాట్లాడుతూ ఆరోగ్యం మానవహక్కని అన్నారు. ప్రతిఒక్కరూ అవసరమైనప్పుడు హెచ్ఐవి నిర్ధారణ చేసుకోవటానికి ఆరోగ్య సేవలను ఉపయోగించుకోవాలని అన్నారు. డిగ్రీ లెక్చరర్లు భాస్కరరావు, టి.అక్కిరాజు, కె.స్వరూపరాణి, జి.వెంకట్రావు, జవి శారదాదేవి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు ఎస్‌బిఐ ఉపకరణాలు

భీమవరం టౌన్ : స్టేట్ బ్యాంకు వారి ఉపకరణాల పంపిణీలో భాగంగా స్థానిక భీమవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్వాడీ సెంటర్లకు ఉపకరణాలు పంపిణీ చేశారు. శనివారం రాయలం గ్రామంలో ఉన్న రాయలం పైడి అంగన్వాడీ సెంటర్‌కు, యనమదుర్రు గ్రామంలో ఉన్న అంగన్వాడీ సెంటర్‌కు ఈ ఉపకరణాలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిఎస్ఆర్ యాక్టివిటీస్ అండ్ గ్రేడింగ్ అంగన్వాడీ సెంటర్స్ అమరావతి సర్కిల్ మిత్ర ఫౌండేషన్ ఛైర్మన్ లక్ష్మీరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా 60 అంగన్వాడీ సెంటర్లకు ఈ ఉపకరణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. పిల్లలకు అవసరమైన టీవి, రైస్ కుక్కర్, వాటర్ ఫిల్టర్, స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులు, స్కూల్ బ్యాగ్స్, బుక్స్, పెన్సిల్ బాక్సులు, జారుడుబల్ల, వాటర్ బాటిల్స్, బాస్కెట్‌బాల్, గ్రౌండ్‌తో పాటు పలు రకాల ఆట వస్తువులు అందజేశారు. భీమవరం స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ హెచ్ఆర్.మెహర్ బాబా, ప్రాజెక్టు సిడిపిఒ టి.లక్ష్మీకాంతం, సూపర్వైజర్ అనిల, టీచర్స్ సిహెచ్.మహాలక్ష్మి, జివిఎస్.కనకదుర్గ పాల్గొన్నారు.

ఆర్థిక నేరాల్లో ఘనుడు జగన్ : మంత్రి నిమ్మల

పాలకొల్లు : ఆర్థిక నేరాల్లో ఎపిని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లిన ఘనుడు జగన్ అని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు నియోజకవర్గంలో పేద, మధ్యతరగతి రోగులకు సిఎం సహాయ నిధి నుంచి రూ.13 లక్షల విలువైన చెక్కులను ఆయన కార్యాలయంలో పంపిణీ చేశారు. జగన్ ఐదేళ్ల పాలనలో సిఎం సహాయ నిధిని రద్దుచేసి, పేద, మధ్యతరగతి రోగులకు వైద్యాన్ని దూరం చేశారని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న విద్యుత్ లోటును 2014 - 19 ఐదేళ్లలో మిగులు విద్యుత్ మార్చిన ఘనత చంద్రబాబుది అన్నారు. గత చంద్రబాబు పాలనలో విద్యుత్ ఛార్జీలను పెంచకపోవడమే కాకుండా నాణ్యమైన విద్యుత్తును అందించారని చెప్పారు.

అగ్నికుల క్షత్రియులకు కళ్యాణ మండపం నిర్మాణం : మంత్రి

యలమంచిలి : రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా యలమంచిలి మండలం కట్టుపాలెం గ్రామంలో అత్యాధునిక వసతులతో అగ్నికుల క్షత్రియులకు కళ్యాణ మండపం నిర్మించి ఇస్తామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కట్టుపాలెం గ్రామంలో శనివారం కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్‌తో పాటు మంత్రి నిమ్మల హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ఆధునిక హంగులతో విరివిగా నిర్మించనున్న ఈ కళ్యాణ మండపాన్ని అగ్నికుల క్షత్రియ సోదరులకు అంకితం చేస్తానని అన్నారు. వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, అగ్నికుల క్షత్రియులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కాళ్ల : సీసలి గ్రామంలో ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. కాళ్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆకివీడు మండలం కుప్పనపూడి గ్రామానికి చెందిన మంజేటి పైడిరాజు(25), చోడవరం మధురాజు శనివారం ఉదయం మోటార్ బైక్‌పై ఎల్ఎన్ పురం గ్రామానికి చెందిన ప్యాకింగ్ పనినిమిత్తం వెళ్తున్నారు. సీసలి గ్రామానికి వచ్చేసరికి రైస్‌మిల్ వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ సంఘటనలో బైక్ నడుపుతున్న పైడిరాజు తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందారు. వెనక కూర్చున్న మధురాజుకు గాయాలవ్వడంతో భీమవరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడి అన్నయ్య నారాయణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాళ్ల ఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మద్యం విక్రేత అరెస్టు : ఆరు మద్యం బాటిళ్లు స్వాధీనం

భీమవరం టౌన్ : అక్రమంగా మద్యం బాటిళ్లు అమ్ముతున్న మహిళని అరెస్టు చేసి, ఆరు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ బలరామ రాజు శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం భీమవరం పట్టణం 12వ వార్డుకు చెందిన ఒక మహిళ అక్రమంగా మద్యం అమ్ముతుందని సమాచారం రావడంతో దాడి చేసి ఆమె వద్దనుంచి ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సిపిఎం మండల కార్యదర్శిగా అలమహారాజు

ప్రజాశక్తి - వీరవాసరం



సిపిఎం మండల కార్యదర్శిగా బొర్రా అలమహారాజు ఎన్నికైనట్లు జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి శనివారం తెలిపారు. వీరవాసరం సిపిఎం 8వ మహాసభలు రెండో రోజు నూతన కమిటీ ఎన్నిక జరిగి, పలు తీర్మాణాలు చేసినట్లు తెలిపారు. మండలంలో పెర్కిపాలెం, వీరవాసరం, మత్స్యపురిపాలెంలలో కలుషితమవుతున్న తాగునీటి చెరువులను యుద్ధప్రాతిపదికన ప్రక్షాళన చేసి, ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందివ్వాలన్నారు. చెరువులు లేని గ్రామాలలో ఎన్‌టిఆర్ సుజల పథకం ప్రారంభించి తాగునీరు సరఫరా చేయాలని, డ్రెయినేజీలు నిర్మాణాలు చేపట్టాలని, అపారిశుధ్య పరిస్థితులను తొలగించి ప్రజలను అంటు రోగాల నుంచి కాపాడాలని మహాసభ తీర్మాణం చేసింది. రైతులు, వృత్తిదారులు, రైతాంగ సమస్యలను పరిష్కరించాలంటూ తీర్మాణం చేశారు. రైతాంగానికి ముప్పుగా ఉన్న గొంతేరు, తొక్కోడు, దేవరకోడు, బసవరాజుకోడు, బైరవకోడు, పోలమూరు డ్రెయిన్‌లను తక్షణమే ప్రక్షాలన చేయాలంటూ తీర్మాణం చేశారు. దళిత పేటలలోని రోడ్లు, డ్రెయినేజీ సదుపాయాలు కల్పించాలని, నవుడూరు నుంచి మడుగు పోలవరంలంక వరకు ప్రమాదకరంగా ఉన్న రోడ్ల పనులను వెంటనే ప్రారంభించాలని, అనువుగా లేని చోట పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలను వేరొక చోటకు మార్పు చేసి, ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, కూలీలకు రెండు వందల రోజుల పనిదినాలు కల్పించాలని, అర్హులైన చేతివృత్తిదారులకు, వితంతువులకు, వృద్ధాప్యం, ఒంటరి మహిళలకు పెన్షన్‌లు మంజూరు చేయాలంటూ పోతుల మృత్యుంజయ ప్రవేశపెట్టిన తీర్మాణాలను మహాసభ ఏకగ్రీవంగా తీర్మాణించింది. కన్వీనర్‌తో పాటు పోతుల మృత్యుంజయ, తాళ్లూరి హరిహరరామలక్ష్మన్, కేతా జ్యోతిబసు, యండమూరి సుబ్బారావు, గొట్టుముక్కల శ్యాంబాబులను మండల కమిటీలో సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని జుత్తిగ నరసింహమూర్తి తెలిపారు.

అక్రమ లేఅవుట్లు వేస్తే కఠిన చర్యలు

సరిపల్లి పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు

గణపవరం : మండలంలోని సరిపల్లి పంచాయతీ పరిధిలో అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సరిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి డి.రామాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చి వ్యాపార షాపులను అనుమతి లేకుండా నిర్మాణం చేయవద్దని అన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారి ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి అనుమతి లేకుండా స్థలాల్లో నిర్మాణం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి లేకుండా భవన నిర్మాణం చేస్తే వారికి పంచాయతీ భవన నిర్మాణ అనుమతులు రావని, దీంతో పాటు కుళాయి, కరెంటు ఏర్పాటుకు ఎన్‌ఒసి ఇవ్వమని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు వ్యతిరేకిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన

తాడేపల్లిగూడెం : గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలు మానవ జీవితానికి చేటు చేస్తాయని, వాటికి దూరంగా ఉండాలని తాడేపల్లిగూడెం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కెఎస్‌వి.కళ్యాణ్ చక్రవర్తి సూచించారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సూచనల మేరకు మత్తు పదార్థాల దుర్వినియోగం, నాటు సారా సేవనం అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన అవగాహనా కార్యక్రమాల నిర్వహణలో భాగంగా తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మత్తు పదార్థాల వినియోగం - పర్యవసానాలు - సమాజానికి ఏవిధంగా చేటు చేస్తాయో అనే అంశంపై శనివారం స్థానిక ఆదిత్య జూనియర్ కళాశాలలో అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కెఎస్‌వి.కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రయోజనాలను విద్యార్థులకు వివరిస్తూ, వాటి వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. అలాగే మత్తు పదార్థాల గురించి ఏమైనా సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులచే మత్తు పదార్థాలు వినియోగించమని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌లు మురళీ మోహన్, ఆర్.దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు : గంజాయి, నాటుసారా, డ్రగ్స్ రహిత ఎపిలో భాగంగా శ్రీఎవిఎస్ఎమ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వల్ల మానవుల ఆరోగ్యం, మానసిక స్థితిపై కలిగే చెడు ప్రభావాల గురించి వివరించారు. విద్యార్థులకు అవగాహన కలిగించారు. పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మద్దాల శ్రీనివాస్, సబ్ ఇన్‌స్పెక్టర్ పి.మహేష్ పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా నిలుస్తాం

ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి

భీమవరం టౌన్ : అనారోగ్యంతో మరణించిన అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ డి.పీటర్ కుటుంబ సభ్యులకు రూ.లక్ష కార్పస్ ఫండ్ చెక్‌ను జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి శనివారం అందజేశారు. సుదీర్ఘకాలం పాటు పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ అనారోగ్య సమస్యలతో ఇటీవల మరణించిన అత్తిలి పోలీస్ స్టేషన్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ డి.పీటర్ కుమారుడు డి.విద్యా సాగర్‌కి కార్పస్ ఫండ్ నుంచి మంజూరైన లక్ష రూపాయల చెక్కును ఎస్‌పి అందజేశారు. అనంతరం వారి కుటుంబ యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని మీ వెనుక పోలీస్ శాఖ ఉందని, ఏ సమస్య ఉన్నా నేరుగా వచ్చి ధైర్యంగా తెలియజేయవచ్చునని తెలిపారు. శాఖా పరంగా ఇంకా రావలసియున్న ప్రయోజనాలను త్వరితగతిన అందేలా చూస్తామని తెలిపారు. జిల్లా అదనపు ఎస్‌పి(అడ్మిన్) వి.భీమారావు, జిల్లా పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ సిహెచ్.మోజేష్ పాల్గొన్నారు.

తేమ శాతం సడలించి రైతులను ఆదుకోవాలి

రైతు సంఘం నాయకులు

పెంటపాడు : వరి ధాన్యంలో ప్రభుత్వం తేమశాతం సడలించి రైతులు, కౌలు రైతులని ఆదుకోవాలని రైతు సంఘం ఆధ్వర్యాన రైతులు, కౌలు రైతులు నిరసన తెలిపారు. శనివారం మండల కేంద్రంలో నిరసననుద్దేశించి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి, మండల కార్యదర్శి సిరపరపు రంగారావు మాట్లాడుతూ గత వారం రోజుల నుంచి వాతావరణ శాస్త్రవేత్తలు ఫెంగల్ తుపాన్ తీవ్రతను హెచ్చరిస్తున్నారని, ఆ తుపాను ప్రభావం వల్ల రైతాంగం తల్లడిల్లిపోతున్నారని వారు తెలిపారు. ఇప్పటికే ధాన్యం మాసూళ్లు 50 శాతం పూర్తయ్యాయని, ఆ ధాన్యాన్ని ఎండబెట్టి ఐకెపి సెంటర్‌కి తోలడానికి వాతావరణం అనుకూలంగా లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17 శాతం తేమశాతం నిబంధన ఉందని, దానికి అనుగుణంగా వాతావరణం లేదని, ఈ పరిస్థితిలో ధాన్యాన్ని అయిన కాడికి ప్రయివేటు దళారులకు రూ.1,400కి అమ్ముకుంటున్నారన్నారు. ఒక బస్తాకి వచ్చి సుమారు రూ.330 రైతులు నష్టపోతున్నారని, ఒక ఎకరానికి రూ.10, 12 వేల నష్టం వాటిల్లుతుందని వారు తెలిపారు. ప్రభుత్వం తేమ శాతాన్ని సడలించి రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిడిపి కూటమి ఎన్నికలలో రైతులకి ఇస్తానన్న పెట్టుబడి సాయాన్ని రూ.20 వేలను వెంటనే విడుదల చేయాలని, కేంద్ర ప్రభుత్వం ఎరువులు, పురుగుల మందుల ధరలు తగ్గించాలని వారు కోరారు. పెనగంటి దుర్గ, లంకలపల్లి అప్పారావు, వడ్డాని సన్యాసిరావు, జక్కంపూడి బంగారురాజు, గెల్ల పాపారావు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఆచంట : తుపాన్ ప్రభావం వల్ల రైతులందరూ అప్రమత్తంగా ఉండి కల్లాలపై ఉన్న ధాన్యాన్ని త్వరితగతిన మిల్లర్లకు చేరవేయాలని తహశీల్దార్ జి.కనకరాజు అన్నారు. శనివారం మండలంలోని ఆచంట, కొడమంచిలి గ్రామాలలో తహశీల్దార్ జి.కనకరాజు, మండల వ్యవసాయాధికారి బి.నాగరాజులు గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. తుపాను ప్రభావంపై రైతులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, కల్లాలపై ఉన్న ధాన్యాన్ని రైతులు త్వరితగతిన మిల్లులకు చేరవేయాలని సూచించారు. వాతావరణం అనుకూలించే వరకూ కోతలు నిలిపి వేయాలని రైతులకు తెలిపారు.

పిహెచ్‌సిల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మునుసుబుగారి వీధి అర్బన్ పిహెచ్‌సిను శనివారం నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వార్డులను పరిశీలించి, వైద్యం పొందుతున్న ప్రజలను వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య సేవలు ఎలా ఉన్నాయి, సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని పేషెంట్లకు కమిషనర్ సూచించారు. ఆసుపత్రిలోని రికార్డులను, మందులను ఆయన పరిశీలించారు. కమిషనర్ వెంట పురపాలక సంఘం ఆర్ఐ నానాజీ, హాస్పటల్ వైద్యులు కారిచర్ల మోహన, సిబ్బంది పాల్గొన్నారు.

ఉండి : యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఉండి తహశీల్దార్, యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రత్యేక అధికారి కావడి నాగార్జున శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి, ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో అవుట్ పేషెంట్, ఇన్ పేషెంట్, ల్యాబ్ పరీక్షలు, గర్భిణీ సేవలు, సిబ్బంది వివరాలు తదితర రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఆసుపత్రిలో ప్రసవించిన మహిళ, బిడ్డ యోగక్షేమాల గురించి ఆరా తీసి, వారికి అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ప్రసవాలు పెరిగేందుకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని ఆయన సూచించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న బ్లాక్ హెల్త్ యూనిట్ నిర్మాణాన్ని పరిశీలించి, నిర్మాణం తొందరగా పూర్తయ్యేందుకు తన వంతు సహకారం అందిస్తానని వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ బిన్నీ శామ్యూల్, ఆరోగ్య కేంద్రం విస్తరణ అధికారి రత్నరాజు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్.రవీంద్ర శనివారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలోని అవుట్ పేషెంట్, ఇన్ పేషెంట్ ల్యాబ్ పరీక్షలు, ఫార్మసిస్ట్ అత్యవసర సేవలు, రోగులకు వైద్యులు అందించే సేవలు వంటి వాటిని పరిశీలించి వాటిపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బి.సాయి చంద్ర, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విస్తరణ అధికారి కృష్ణకుమార్, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణాజిల్లా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

మానవతా ధృక్పథంతో రైతులను ఆదుకోండి

రైస్ మిల్లర్లతో జెసి రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం : వాతావరణం అనుకూలంగా లేని కారణంగా కృష్ణాజిల్లా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి మానవతా ధృక్పథంతో ఆదుకోవాలని జిల్లా రైస్ మిల్లుల యజమానులను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి కోరారు. స్థానిక కలెక్టరేట్లో జిల్లా రైస్ మిల్లర్స్ యజమానులు, అధికారులతో జెసి సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. తుపాను కారణంగా వాతావరణంలో ప్రతికూల మార్పులు వచ్చాయని, ఈ నేపథ్యంలో కృష్ణాజిల్లా రైతులు పండించిన ధాన్యాన్ని మానవతా ధృక్పథంతో కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని కోరారు. దీనికి సంబంధించి ప్రతి రైస్‌మిల్ నుంచి రెండు సొంత వాహనలను కృష్ణ జిల్లాకు పంపించాలని మిల్లర్స్ యజమానులకు సూచించారు. భారీ వర్షాల కారణంగా వరి కోతలను కొన్ని రోజులు వాయిదా వేయాలని కోరారు. ఇప్పటికే వరి కోతలు కోసి, కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని, లేనిపక్షంలో సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిల్లర్లు అన్ని విధాలా సహకరించాలని కోరారు. వీలైనంత ఎక్కువమంది హమాలీలను పెట్టి ధాన్యాన్ని దిగుమతి చేయించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్ టి.శివరామ ప్రసాద్, ఎఎస్ఒ శివశంకర్, పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సామంతపూడి శ్రీరామరాజు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్ దినోత్సవం

పాలకొల్లు : పాలకొల్లు శ్రీ దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్, యునైటెడ్ కాపు వనిత క్లబ్ సంయుక్త నిర్వహణలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కృష్ణ హాస్పిటల్ వైద్యులు అనుపమ మాట్లాడుతూ ఎయిడ్స్ సంక్రమణం, నివారణ గురించిన విషయాలపై అవగాహన కలిగించారు. ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల సానుభూతి కలిగి ఉండాలని కోరారు. వ్యాధి సంక్రమించిన వారు భయపడకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. చిత్రలేఖనం, రీల్ మేకింగ్, పోస్టర్ ప్రెజెంటేషన్, డిబేట్, రంగోలి పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి, వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్ పాల్గొన్నారు.

వనసమారాధనలు ఐక్యతకు దోహదం

మాజీ జెడ్‌పిటిసి అడ్డాల పద్మావతి



కార్తీక వన సమారాధనలో యాత్రికులు

ప్రజాశక్తి - కాళ్ల

కార్తీకమాసంలో నిర్వహించే కార్తీక వనసమారాధన కార్యక్రమాలు ప్రజల్లో ఐకమత్యాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని మాజీ జెడ్‌పిటిసి అడ్డాల పద్మావతి పేర్కొన్నారు. కాళ్లకూరు గ్రామంలో పార్వతి సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో లక్ష పత్రి పూజ, స్వామివారికి రుద్రాభిషేకం, హోమాలు, శాంతి కల్యాణం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్తీకమాసం సందర్భంగా దాతల సహకారంతో అన్న సమారాధన నిర్వహించారు. గ్రామస్తులతోపాటు, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. కార్తీక వన సమారాధనకు దాతలు అడ్డాల గణపతిరాజు, గాదిరాజు వెంకట సుబ్బారాజు, అడ్డాల వెంకటసుబ్బారాజు, అడ్డాల భగవాన్‌రాజు, పెన్మెత్స వెంకట రామరాజు, కునాధరాజు వెంకట పద్మావతి, గోకరాజు పెద్దిరాజు, పెన్మెత్స గోపాలరాజు, కమ్మిల శివరామరాజు, చేకూరి పుల్లంరాజు ఆర్థికంగా సహాయ సహకారాలు అందించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది, యాత్రికులు పాల్గొన్నారు.

పోలీసుల సేవలు ఆదర్శప్రాయం

ఉద్యోగవిరమణ సత్కార కార్యక్రమంలో ఎస్‌పి



ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందిని సత్కరిస్తున్న ఎస్‌పి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పోలీస్ అంటేనే క్రమశిక్షణకు మారుపేరని, పోలీసుల సేవలు ఆదర్శప్రాయం అని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి అన్నారు. సాధారణ ప్రభుత్వ ఉద్యోగం వేరు, పోలీసు ఉద్యోగం వేరన్నారు. అలాంటి శాఖలో సుదీర్ఘ కాలం బాధ్యతాయుతంగా సేవలు అందించిన సిబ్బంది అభినందనీయులని ఎస్‌పి అన్నారు. శనివారం ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందిని ఎస్‌పి ఆయన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి సర్వీసులో కుటుంబ వ్యవహారాలను పక్కన పెట్టి ప్రతి రోజు ప్రజా సేవలో నిమగ్నమై సమయం, శక్తి అన్ని వినియోగిస్తారన్నారు. దాదాపు 37-40 సంవత్సరాల పాటు ప్రజలకు విశిష్టమైన సేవలను అందించి, ఎలాంటి మచ్చ లేకుండా సంతోషంగా ఈరోజు ఉద్యోగవిరమణ పొందుతున్న పోలీసులకు, వారికి సహకరించిన కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంకితభావంతో పనిచేసిన వారు పోలీసు శాఖకు, ప్రజలకు ఎప్పుడూ గుర్తుండిపోతారన్నారు. ఇక నుంచి ఆరోగ్యంగా కుటుంబ సభ్యులతో సంతోషం గడపాలని ఆయన ఆకాంక్షించారు. తామంతా పోలీసు కుటుంబ సభ్యులమని, ఏ సమస్య వచ్చినా అండగా నిలబడతామని అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో లక్ష్మణ్ కుమార్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, సిసిఎస్(భీమవరం), వి.వరప్రసాద్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, డిసిఆర్‌బి, (భీమవరం) సూర్యారావు, హెడ్ కానిస్టేబుల్ (పెనుగొండ) పోలీస్ స్టేషన్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పితో పాటు అదనపు ఎస్‌పి(అడ్మిన్) వి.భీమారావు, జిల్లా ఆర్మ్ రిజర్వ్ డిఎస్‌పి ఎంవివి.సత్యనారాయణ, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వరరావు, జిల్లా పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ సిహెచ్.మోజేష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు శ్రీనివాస్ చిత్రపట ఆవిష్కరణ

నరసాపురం : నరసాపురం పట్టణానికి చెందిన కీర్తిశేషులు, సీనియర్ న్యాయవాది కొమాండూరి శ్రీనివాస్ చిత్రపట ఆవిష్కరణ కార్యక్రమం నరసాపురంలోని తెలగ కళ్యాణ మండపంలో ఈనెల 1వ తేదీన నిర్వహిస్తున్నట్లు నరసాపురం న్యాయవాదుల సంఘం అధ్యక్షులు చేగొండి శ్రీరంగ మోహన బాలాజీ తెలిపారు. శనివారం నరసాపురం బార్ అసోసియేషన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొమాండూరి శ్రీనివాస్ నరసాపురం కోర్టులో సుదీర్ఘ కాలం న్యాయవాదిగా సేవలు అందించారన్నారు. ఆయన ప్రత్యేకించి సివిల్ న్యాయవాదిగా మంచి పేరు గడించారన్నారు. ఉదయం 10.30 నిమిషాలకు జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి, పశ్చిమగోదావరి జిల్లా పరిపాలనా న్యాయమూర్తి కె.సురేష్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఆకుల వెంకట శేషసాయి, జిల్లా న్యాయమూర్తి సి.పురుషోత్తమ కుమార్, జిల్లా అదనపు న్యాయమూర్తి పి.విజయదుర్గ, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యులు కె.చిదంబరం, ఇతర సీనియర్ న్యాయవాదులు పాల్గొంటారని బాలాజీ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి రమేష్, ప్రధాన కార్యదర్శి రంపా పుల్లాజీ, కార్యదర్శి కురెళ్ల సోమశేఖర్, గ్రంథాలయ కార్యదర్శి నారిన శ్రీనివాసరావు, కోశాధికారి పూరిళ్ల శ్రీనివాస్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి మేడిది శ్రీమంత్, మహిళా ప్రతినిధి బి.ప్రగతి, కార్యవర్గసభ్యులు ఓసూరి జ్యోతి మాంగళ్య, తోట రాజ్యసూర్యలక్ష్మి, కుంచె దుర్గాభవాని పాల్గొన్నారు.

ఐటిఐ కాలేజీ అభివృద్ధికి కృషి చేస్తా

ఐఎంసి ఛైర్మన్, ఎంఎల్‌సి రవీంద్రనాథ్

ఆచంట : ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటిఐ) కాలేజీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఐఎంసి ఛైర్మన్, ఎంఎల్‌సి వంక రవీంద్రనాథ్ అన్నారు. ఆచంట ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో ఇన్స్టిట్యూట్ మేనేజ్మెంట్ కమిటీ(ఐఎంసి) తొలి సమావేశం వంకా రవీంద్రనాథ్ అధ్యక్షతన శనివారం మధ్యాహ్నం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఐటిఐ కాలేజీ అద్దె భవనంలో కొనసాగుతున్న నేపథ్యంలో ఉచితంగా ప్రభుత్వ భూమి సుమారు రెండు ఎకరాల కోసం ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. కాలేజీ సీట్లు పెంపుకు, ఐటిఐ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసే నిమిత్తం జిల్లా కలెక్టర్, స్థానిక ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయు నిమిత్తం తీర్మానం చేసినట్లు తెలిపారు. ఉపాధి శిక్షణా శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ మధు శ్రీనివాసరావు, ఐఎంసి మెంబర్ గాజుల బుల్లి పుల్లారావు, దొడ్డిపట్ల సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ పరస వెంకట శ్రీధర్, ట్రైనింగ్ ఆఫీసర్ ఇందుకూరి వెంకట సత్యనారాయణ రాజు, పిల్ల ఆనందబాబు పాల్గొన్నారు.